

### పదోన్నతుల లొల్లి..
ఇరిగేషన్ శాఖలో పదోన్నతులను అధికారులు పట్టించుకోకపోవడంతో ఉద్యోగులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

- 8లో ▸



### పచ్చి పసుపు తేవద్దు
మార్కెట్ యార్డుకు పచ్చి పసుపు తెచ్చి రైతులు నష్టపోవద్దని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.5 /13.7

### వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.



నిజామాబాద్ పార్లమెంటరీ స్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పాల్గొన్న పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ఎమ్మెల్సీలు

# స్థానికంలో గెలుపే లక్ష్యం కావాలి

- కష్టపడ్డ కార్యకర్తలకు న్యాయం చేస్తాం
- వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు ఖాయం
- జిల్లాకు మంత్రి పదవి వస్తుంది
- జిల్లాకు వచ్చే అగ్రికల్చర్ కాలేజీ తెలంగాణ వర్సిటీలో ఏర్పాటు చేస్తాం
- టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఆశించిన స్థాయిలో ఉందని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఇది పీసీసీ అధ్యక్షుడి జిల్లా అని, స్థానిక ఎన్నికల్లో ఒక్క సీటు ఓడిపోవద్దన్నారు. జిల్లాకు మంత్రి పదవి వస్తుందన్నారు. మంగళవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో జరిగిన నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్లు ఎన్నో కష్టానష్టాలకు ఓర్చి పార్టీ జెండా మోసిన కార్యకర్తలను ఆదుకునే సమ యం ఇదేనన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పదవులు రాలేదని నిరాశకు గురికావద్దని,స్థానిక సమరం మీదేనని, ఓపికగా ఉండా లన్నా రు. 35 ఏళ్లుగా రాజకీయాల్లో సేవలందించిన అనంతరం తాను పార్టీ అధ్యక్షుడిని అయ్యానన్నారు. కష్టకాలంలో పని చేసిన కార్యకర్తలకు, నాయకులకు పదవులు ఇస్తామన్నారు. స్థాని క ఎన్నికల్లో ఇన్‌చార్జులదే బాధ్యత అని, విభేదాలను వీడి అందరినీ కలుపుకుని ఐక్యంగా ముందుకు పోవాలన్నారు. తేడా వస్తే మీకే నష్టమని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కరిపై నడవదని, పీసీసీ, ఏఐసీసీ చెప్పినట్లు నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. ఈసారి ఎన్నికల్లో 63 సీట్లు వచ్చాయని, రానున్న ఎన్నికల్లో 100 సీట్లు గెలుచుకోవడంతో పాటు మరిన్ని ఎక్కువ ఎంపీ సీట్లు గెలిచి రాహుల్ గాంధీ ప్రధాని కావడమే లక్ష్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ చేసిన ఆర్థిక విధ్వంసం, దోపిడీ, రాష్ట్రాన్ని మోసం చేసిన తీరును ప్రజలకు వివరించాలని సూచించారు. ఆరు గ్యారెంటీలను విజయవంతంగా అమలు చే స్తున్న కాంగ్రెస్ పార్టీ గురించి గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడగాలన్నారు. ఫార్ములా – ఈ కార్ రేస్‌లో అడ్డంగా దొరికిన దొంగ కేటీఆర్ అని, పదేళ్ల తర్వాత బీసీలపై కవిత ప్రేమ నటిస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. బీజేపీ మతం పేరుతో 8 సీట్లు గెలిచిందని, అయితే ఇప్పటి వరకు కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు కేంద్రం నుంచి పైసా నిధులు తేలేదని విమర్శించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని ఎవరూ బెదిరించలేరని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపర్చేలా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 26 వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జిల్లాకు త్వరలోనే అగ్రికల్చర్ కాలేజ్ వస్తుందని, తెలంగాణ యూనివర్సిటీలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. రూ.2 లక్షల వరకు రుణ మాఫీ ఖాయమన్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ప్రొటోకాల్ ఇన్‌చార్జి వేణుగోపాల్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పి సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్, అడ్లూర్ లక్ష్మణ్ కుమార్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్‌కుమార్, అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్‌హందాన్, జావేద్ అక్తర్, నుడా చైర్మన్ కేశవేణు, డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి, నాయకులు వినయ్ రెడ్డి, సునీల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, అంతరెడ్డి రాజరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, రాజేశ్వర్, ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, శేఖర్‌గౌడ్, ఖైసర్, నరేందర్‌సింగ్, మునిపల్లి సాయరెడ్డి, వేణురాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నఫ్రత్ చోడో.. నిజామాబాద్ జోడో..



రాహుల్ గాంధీ నినాదం నఫ్రత్ చోడో.. దేశ్ జోడో అన్న విధంగానే నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నఫ్రత్ చోడో.. నిజామాబాద్ జోడో.. అని ఐకమత్యంగా ఉండి స్థానిక ఎన్నికల్లో వందశాతం విజయం సాధించాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కు అంబేడ్కర్ అంటే గౌరవం లేదని, రాజ్యాంగంపై నమ్మకం లేదని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలే శత్రువులని పేర్కొన్నారు.

### రాష్ట్రానికి, దేశానికి కాంగ్రెస్ పార్టీయే రక్ష..



రాష్ట్రానికి దేశానికి, కాంగ్రెస్ పార్టీయే రక్ష అని, పేదలకు సంక్షేమ పథకాలను అందించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కార్యకర్తల కృషి వల్లే మేమంతా పదవుల్లో ఉన్నామని, రానున్న స్థానిక ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపించడానికి కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. సోషల్ మీడియాను మెయింటెన్ చేయడానికి కేటీఆర్ ప్రతి నెల రూ.కోటి ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామ, మండల, పురపాలక స్థాయిల్లో పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించాలన్నా రు. నాయకులు, కార్యకర్తలకు పట్టువిడుపులు ఉండాలని, అందరినీ కలుపుకుపోవాలన్నారు.



మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు

## న్యూస్‌రీల్

### యూరియా కొరత లేదు
సిరికొండ: జిల్లాలో యూరియా కొరత లేదని, పొలాలకు మూడు దఫాలుగా అవసరమైన యూరియాను ఒకే సారి కాకుండా విడతల వారీగా కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. మొక్కజొన్న సాగుపై సిరికొండ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయించొద్దని ఆదేశించారు. పంటలకు అవసరమైన మేరకు యూరియాను సొసైటీల్లో, ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. సిరికొండ మండలంలో వరి సాగును ముందస్తుగా ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఆయనవెంట ఏవో నర్సయ్య, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

### అల్లకొండ ఖిల్లాకు మరమ్మతులు చేపట్టండి



ఆర్మూర్: బాల్కొండ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న పురాతన అల్లకొండ ఖిల్లాకు మరమ్మతులు చేపట్టాలని ఖిల్లా పరిరక్షణ సమితి ప్రతినిధులు ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నేషనల్ యూత్ ప్రాజెక్ట్ యునైటెడ్ నేషన్స్ ఆఫ్ యూత్ ఆర్గనైజేషన్ దక్షిణ ఆసియా మైత్రి సదస్సు అధ్యక్షుడు మోతె రామాగౌడ్ నాయకత్వంలో అల్లకొండ ఖిల్లా పరిరక్షణ సమితి ప్రతినిధులు మంగళవారం ఆర్డీవోను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అల్లకొండ ఖిల్లా పరిరక్షణ సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు బీఆర్ నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. పూర్వం 1059లో అల్లయ్య, కొండయ్య అనే మల్ల యోధులచే నిర్మితమైన అల్లకొండ పట్టణానికి దేశంలోనే రెండో రాజధానిగా పేరు ప్రఖ్యాతలు ఉన్నట్లు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయన్నారు. బాల్కొండ ఖిల్లా మరమ్మతుల విషయమై 2024 ఆగస్టులో దేశ ప్రధానమంత్రికి, రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో రామకృష్ణ తదితరులు ఉన్నారు.

### రాష్ట్రంలో రౌడీల పాలన



సుభాష్‌నగర్: రాష్ట్రంలో కొనసాగుతోంది కాంగ్రెస్ ప్రజాపాలన కాదని, రౌడీ పాలన అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం విమర్శించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. హింసతో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తూ, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ తమ నిరాధారమైన ఆరోపణలకు భౌతికదాడులను జోడించడం దిగజారిన రాజకీయ పద్ధతి అని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు.

**దాడులు తెలంగాణ సంస్కృతి కాదు..**



తమ పార్టీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి పేర్కొన్నారు. దాడులు చేయడం తెలంగాణ సంస్కృతి కాదని, దాడిలో బీజేపీ కార్యకర్తల తలలు పగిలాయని పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను అరెస్ట్ చేయాలని, దాడి వెనక ఎవరు ఉన్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె విరమణ



నిజామాబాద్ అర్బన్: డిమాండ్‌ల సాధన కోసం సమ్మె చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం విరమించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మంగళవారం చేపట్టిన చర్చలు సఫలం కావడంతో నిరవధిక సమ్మె విరమణ పత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. ఆర్థిక అంశాలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో సమ్మె విరమిస్తున్నామన్నారు.

# రేవంత్‌రెడ్డి సమైక్యవాది





మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు

- సీఎం రేవంత్‌కు కాంగ్రెస్, బీజేపీ రెండు అధిష్టానాలు
- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శ

నిజామాబాద్ అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సమైక్యవాది అని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి వ్యవహారశైలి కారణంగా హైదరాబాద్ నుంచి రియల్ ఎస్టేట్, ఫిల్మ్ ఇండస్ట్రీ ఏపీకి తరలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్ములా– ఈ కారు రేసు వ్యవహారంలో కేటీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ఇరికించిందని, క్వాష్ పిటిషన్‌ను హై కోర్టు కొట్టివేయడాన్ని అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు కుట్ర పూరితంగానే కేటీఆర్, కేసీఆర్‌ను కేసుల్లో ఇరికించాలనే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఎంపీ అర్వింద్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్, బీజేపీ రెండు అధిష్టానాలని, ఆయన అవినీతిపై బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఇది ప్రజాపాలన కాదని దుష్టపరిపాలన అని అన్నారు. ఒక్క ఏడాదిలో రూ.లక్షా 24 వేల కోట్ల అప్పులు చేసిన రేవంత్‌రెడ్డి అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, రాంకిషన్‌రావు, సుజిత్ సింగ్‌ఠాకూర్, ఎస్‌ఏ అలీం పాల్గొన్నారు.

### నేడు, రేపు జాబ్ మేళా

నిజామాబాద్ అర్బన్: హెచ్‌సీఎల్ టెక్ – బీ సంస్థ (ఎస్‌సీఎల్ టెక్‌బీ–జిల్లా ఇంటర్మీడియెట్ విద్య) ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ జనరల్, వొకేషనల్ 2023 – 24 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు, ప్రస్తుత విద్యా సంవత్సరం (2024–25) రెండో ఏడాది పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు నేడు (బుధవారం) జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సాఫ్ట్‌వేర్ రంగంలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తామని, 2023 – 24లో ఇంటర్ పూర్తయిన, 2025లో పరీక్షలు రాయనున్న ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, బైపీసీ ఒకేషనల్‌లో కంప్యూటర్ బేస్డ్ గ్రూపుల విద్యార్థులు అర్హులని తెలిపారు. బోధన్‌లోని విద్యావికాస్ జూనియర్ కళాశాలలో ఉదయం 9గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నుంచి 75శాతం మార్కులతో, 60శాతం మ్యాథమెటిక్స్‌లో మార్కులు పొందిన వారు సర్టిఫికెట్లతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆండ్రాయిడ్ ఫోన్‌తో జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రతినిధి(80740 65803, 79818 34205)ని సంప్రదించాలని పేర్కొన్నారు.

# రైతులు ఎక్కడ..?

- రైతు నేస్తం కార్యక్రమానికి కరువైన స్పందన
- ప్రతి మంగళవారం జరిగే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకాని వైనం
- వ్యవసాయాధికారులే పాల్గొంటున్నారు..
- ఖాళీగా కనిపిస్తున్న రైతు వేదికలు



కమ్మర్‌పల్లిలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు తప్ప కనిపించని రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' కార్యక్రమానికి స్పందన కరువైంది. వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై పంటల సాగుపై శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలు వినడం లేదు. కేవలం వ్యవసాయాధికారులే పాల్గొని వెళ్తున్నారు. రైతులు లేక జిల్లాలోని రైతు వేదికలు బోసిపోతున్నాయి. తద్వారా రైతుల మేలు కోరి ఏర్పాటు చేసిన కార్యక్రమం నీరుగారిపోతోంది. మంగళవారం హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు మొక్కజొన్న సాగుపై ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. జిల్లాలోని పలు రైతు వేదికల్లో రైతుల హాజరును 'సాక్షి' పరిశీలించింది. మొత్తం 31 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ జరుగగా మొత్తం 683 మంది రైతులు హాజరైనట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. అయితే చాలా వేదికల్లో పదిమంది కూడా హాజరు కాలేదు. కొన్ని చోట్ల వచ్చిన రైతులు హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసి కొద్ది సేపటికే వెళ్లిపోయారు. కార్యక్రమం అయిపోయే వరకు అధికారులే ఉన్నారు. రైతుల హాజరును చూపించుకోవడానికి కొంతమంది ఏఈవోలు బోగస్ సంతకాలు చేయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### సమాచారం ఇచ్చినా రావడం లేదు

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌పై వ్యవసాయాధికారులకు ఒకరోజు ముందు షెడ్యూల్ వస్తుంది. ఏ టాపిక్‌పై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారో ఏవోలు, ఏఈవోలకు సమాచారం అందుతుంది. రైతులు హాజరయ్యేలా చూడాలని పై అధికారుల ఆదేశాలతో రైతులకు తెలిసేలా సోమవారమే వాట్సప్ గ్రూపుల్లో, గ్రామ పంచాయతీ మైకుల్లో ప్రచా రం చేస్తున్నారు. అయినప్పటికీ రైతులు వీడియో కాన్ఫరెన్స్‌కు రావడం లేదు. ఇలా చాలా వారాలుగా రైతులు లేక రైతు వేదికలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కొందరు ఏఈవోలు రైతుల దగ్గరకు వెళ్లి బతిమిలాడి పిలుస్తున్నారు. ఎంత చెప్పినా రైతుల నుంచి స్పందన రాకపోవడంతో ఏఈవోలు కూడా మిన్నకుండిపోతున్నారు. వచ్చిన వారితోనే రైతు నేస్తం కార్యక్రమాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి వారానికోసారి నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని చాలా మంది రైతులు సద్వినియోగం చేసుకోకపోవడం పై వ్యవసాయ అధికారులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

# ఇండస్ట్రియల్ కారిడార్‌తో వ్యాపార, ఉద్యోగావకాశాలు



జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతి పత్రం అందిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్: ఇండస్ట్రియల్ కారిడార్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను నగరం చుట్టూ 15 కిలోమీటర్ల లోపు స్థాపించాలని, తద్వారా వ్యాపార, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు అన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆర్ జగదీశ్వర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి రైల్వే లైన్‌ను డబ్లింగ్ చేస్తూ గుడ్స్ షెడ్ కారిడార్ నిర్మిస్తే వ్యాపార రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. నిజామాబాద్‌లో కంటైనర్ డిపో నిర్మిస్తే ఎగుమతులు సులువవుతుందన్నారు. స్పైస్ బోర్డు ఏర్పాటు తరువాత పసుపు, వరి, తృణధాన్యాలు పండించే రైతులకు అవగాహన సదస్సు లు ఏర్పాటు చేసి పంట దిగుబడులకు మంచి ధర దక్కే లా ప్రయత్నాలు చేయా లని కోరారు. ఈశాన్య రాష్ట్రాలు, గుజరాత్ రాష్ట్రానికి ఇస్తున్న సబ్సిడీలను నిజామాబాద్‌కి కూడా ఇస్తే ఇక్కడ పరిశ్రమలు వృద్ధి చెందుతాయన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సభ్యులు శ్రీనివాసరావు, గంగాధర్‌రావు, అంబోజి హరిప్రసాద్, జమీల్, పూర్వ అధ్యక్షుడు వెంకటనర్సాగౌడ్ తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### 162 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ రైస్‌మిల్లు నుంచి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 162 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఉదయం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పోలీసులతో కలిసి దేవునిపల్లి పరిధిలో ఉన్న సాయి శ్రీనివాస ట్రేడింగ్ మిల్లులో దాడులు చేపట్టారు. అక్కడ నుంచి అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసి ఉంచిన ఓ డీసీఎం వాహనాన్ని గుర్తించి పట్టుకున్నారు. అందులో మొత్తం 277 బస్తాల్లో నింపి ఉంచిన రేషన్(పీడీఎస్)బియ్యంను గుర్తించి సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య విచారణ జరిపారు. బియ్యం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

### బస్సు నుంచి పడి ఒకరికి గాయాలు

వర్ని: మండల కేంద్రంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సులో నుంచి ఓ పడి వ్యక్తి పడి తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం వర్ని నుంచి పాత వర్ని మీదుగా బోధన్ వెళ్తున్న బస్సు నుంచి ఆఫాది ఫారం గ్రామానికి చెందిన పాల్తియా కిషన్ (45)ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో బోధన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### రికవరీ ఫోన్ల అందజేత



తాడ్వాయి(ఎల్లారెడ్డి): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గుర్తించి ఆ ఫోన్ల యజమానులకు అందజేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన కీసరి ప్రవీణ్, లింగంపేట్ మండలంలోని మోతే గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ సెల్‌ఫోనులు పోయాయని గతంలో ఫిర్యాదు చేశారు. రికవరీ ఫోన్‌లను మంగళవారం యజమానులకు ఇచ్చారు.

# కాంగ్రెస్ సమావేశంలో స్వల్ప ఉద్రిక్తత

- జీవన్‌రెడ్డి, సంజయ్‌కుమార్ వర్గాల మధ్య వాగ్వాదం



నినాదాలు చెయ్యొద్దంటూ తన వర్గాన్ని సముదాయిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డితో వాగ్వావాదానికి దిగిన జగిత్యాల కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమావేశం ప్రారంభానికి ముందు ఏఐసీసీ ఆదేశాల మేరకు కార్యక్రమానికి హాజరైన ముఖ్య కార్యకర్తలు గేటు వద్ద ఉన్న రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సూచించారు. దీంతో సంతకాలు చేసేందుకు వెళ్లిన జగిత్యాల నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుల జాబితా రిజిస్టర్‌లో లేకపోవడం, ఇటీవలే కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ వర్గీయుల పేర్లు ఉండటంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వర్గీయులు ఆగ్రహానికి లోనయ్యారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు మానాల మోహన్‌రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై మానాల మోహన్‌రెడ్డిని నిలదీశారు.

అసహనానికి లోనైన మోహన్‌రెడ్డి తనను ప్రశ్నించడానికి మీరెవరని కార్యకర్తలపై మండిపడ్డారు. కార్యకర్తల నినాదాలతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సైతం తన వర్గీయుల పేర్లు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కష్టకాలంలో కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీకి సేవ చేస్తున్న తనను కాదని ఎమ్మెల్యే సంజయ్‌ను సమావేశానికి ఎలా పిలుస్తారని మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇతర నాయకులు కలుగచేసుకుని ఇద్దరినీ సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. అయితే సమావేశం ప్రారంభమైన అనంతరం ఎమ్మెల్యే సంజయ్ ప్రసంగిస్తున్న సమయంలో జీవన్‌రెడ్డి వర్గీయులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ప్రతిగా సంజయ్ వర్గీయులు నినాదాలు చేయడంతో రాష్ట్ర నాయకులు చేసేది లేక మిన్నకుండిపోయారు. జీవన్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించగానే మళ్లీ ఆయన వర్గీయులు కొద్దిసేపు నినాదాలతో హోరెత్తించారు. సమావేశం అనంతరం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగింది.

# హెచ్‌ఎంపీవీతో భయం వద్దు

- జిల్లాకు ధోకా లేదు
- కేసులు నమోదైతే చికిత్సకు సర్వం సిద్ధం
- డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: చైనాలో విజృంభిస్తున్న హ్యూమన్ మెటా న్యూమోవైరస్ (హెచ్‌ఎమ్‌పీవీ) వ్యాప్తిపై జిల్లావాసులు భయపడొద్దని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి రాజశ్రీ ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఒకవేళ కేసులు నమోదైతే చికిత్సలు అందించడానికి ఆస్పత్రుల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హెచ్‌ఎమ్‌పీవీ అనేది ఇతర శ్వాసకోశ వైరస్‌లాగా ఉంటుందని, శీతాకాలంలో జలుబు, ఫ్లూ వంటి లక్షణాలను కలిగిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణలో ఈ వైరస్ కేసులేవీ నమోదు కాలేదన్నారు. నివారణ చర్యల్లో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

**చేయకూడనివి..**

- కరచాలనం
- రుమాలు పునర్వినియోగం
- అనారోగ్య వ్యక్తులతో సన్నిహిత సంబంధాలు
- కళ్లు, ముక్కు, నోటిని తరచుగా తాకడం
- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడం
- వైద్యుడిని సంప్రదించకుండా మందులు తీసుకోవడం (స్వీయ మందులు)

**జాగ్రత్తలు..**

- దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు నోరు, ముక్కును రుమాలు లేదా టిష్యూ పేపర్‌తో కప్పుకోవాలి
- సబ్బుతో లేదా ఆల్కహాల్ ఆధారిత శానిటైజర్‌తో చేతులను తరచుగా శుభ్రంగా కడగాలి.
- రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఉండటాన్ని నివారించాలి.
- ఫ్లూతో బాధపడుతున్న వ్యక్తుల నుంచి ఒక చేయి పొడవు కంటే ఎక్కువ దూరంలో ఉండాలి
- జ్వరం, దగ్గు, తుమ్ములు ఉంటే బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలి.
- నిత్యం పుష్కలంగా నీరు తాగాలి, పోషికాహారం తీసుకోవాలి.
- అనారోగ్యంతో ఉంటే ఇంట్లోనే ఉండాలి, ఇతరులకు దూరంగా ఉండాలి.
- తగినంత నిద్రపోవాలి.

# పచ్చి పసుపు తెచ్చి నష్టపోవద్దు

- తేమశాతం 12లోపు ఉండేలా చూడాలి..
- నిజామాబాద్ మార్కెట్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి
- పసుపు రైతుల అవగాహనా ప్రచార రథాలు ప్రారంభం



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న భూపతిరెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు పసుపు విక్రయాల్లో దేశంలోనే పేరుగాంచిందని, రైతులు పచ్చి పసుపు తీసుకొచ్చి నష్టపోవద్దని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి అన్నారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పసుపు రైతుల అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాలను మంగళవారం నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ.. బాగా ఎండిన పసుపును మాత్రమే తీసుకు రావాలని, 12లోపు తేమశాతం ఉండేలా తీసుకొస్తే రూ.10వేలకు తగ్గకుండా ధర పలికేలా మార్కెట్ కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పాలకవర్గం లేక మార్కెట్ కమిటీ వైభవం కోల్పోయిందని, మార్కెట్‌ను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ప్రభుత్వం రైతు బిడ్డ అయిన ముప్ప గంగారెడ్డిని చైర్మన్‌గా ప్రకటించిందని, మార్కెట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనలో రూ.15కోట్లు ఇతర మార్కెట్లకు మళ్లించారని, వాటిని తిరిగి ఇవ్వాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రూ.8 కోట్లతో కూరగాయల హోల్‌సేల్‌కు అవసరమైన 40 మడిగెల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, సిబ్బంది కొరత విషయాన్ని కూడా మంత్రితో చర్చిస్తామన్నారు. అనంతరం గోదాములు, మడిగెలు, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, సీనియర్ నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయిరెడ్డి, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, ఎల్లోల్ల సాయిరెడ్డి, గోర్కంటి లింగన్న, గంగాప్రసాద్, అగ్గు భోజన్న, వ్యాపారులు మారుతి మల్లేష్, శంకర్, కమల్ కిశోర్ ఇనానీ, అధికారులు లాబన్, మధు, తదితరులున్నారు.

# ఇరిగేషన్‌లో పదోన్నతుల లొల్లి

- ఆర్నెళ్లుగా ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులు
- భర్తీ చేయని అధికారులు
- ఈఎన్‌సీకి ఫిర్యాదు చేసిన ఉద్యోగులు




నిజామాబాద్‌నాగారం: ఇరిగేషన్‌శాఖలో పదోన్నతుల లొల్లి నడుస్తుంది. పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులను అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. దీంతో తీవ్ర ఆవేదనలో ఉన్న ఉద్యోగులు ఇటీవల హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ(ఇంజనీర్ ఇన్ ఛీఫ్)కి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం శాఖలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

**ఇది పరిస్థితి..**

నిజామాబాద్ ఇరిగేషన్‌శాఖలో క్యాడర్ బట్టి పోస్టులు ఖాళీ అయితే వెంటనే పదోన్నతులు చేపట్టాల్సి ఉంటుంది. ఈక్రమంలో ఆరు నెలల కిందట సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన ఇద్దరు ఉద్యోగులు పదవీ విరమణ చేయడంతో గత ఏడాది జూలైలో ఆ పోస్టులు ఖాళీ అయ్యాయి. నిబంధనల ప్రకారం జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో సీనియార్టీ ప్రకారం ఆయా పోస్టులను అధికారులు భర్తీ చేయాలి. కానీ ఆరు నెలలుగా జిల్లాస్థాయి అధికారులు ఎవరికి వారు ఇదిగో, అదిగో అంటు కాలం వెళ్లదీస్తున్నారు. ఇతర జిల్లాల్లో ఖాళీ అయిన పోస్టులను నిబంధనల ప్రకారం వెంటనే పదోన్నతుల ఆధారంగా భర్తీ చేశారు. ఇక్కడ మాత్రం రెండు సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకపోవడంతో జోనల్‌క్యాడర్ స్థాయి ఉద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోస్టులు భర్తీకాకపోవడంతో తమకు అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. జూనియర్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు ఇస్తే వీరి కింద రికార్డు అసిస్టెంట్‌లకు, తర్వాత అటెండర్లకు పదోన్నతులు వస్తాయి. కానీ సరైనా సమయంలో పదోన్నతులు ఇవ్వకపోవడంతో ఇతర జిల్లాల వారు వీళ్ల కంటే ముందే పదోన్నతి పొంది సీనియర్‌గా మారుతున్నారు. ఇక్కడ మాత్రం అన్ని అర్హతలు ఉన్నా పదోన్నతుల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

**ఈఎన్‌సీ స్పందిస్తేనే..**

పదోన్నతుల్లో ఆలస్యం అవుతుందని భావించిన శాఖలోని జూనియర్ అసిస్టెంట్ క్యాడర్, కింది స్థాయిలో ఉన్న ఉద్యోగులు అందరు కలిసి సీఈ(ఛీఫ్ ఇంజనీర్)కు ఇటీవల సమస్యను విన్నవించారు. అలాగే హైదరాబాద్‌లోని ఈఎన్‌సీకి ఫిర్యాదు చేశారు. మూకుమ్మడిగా సంతకాలు చేసి అధికారులతోపాటు శాఖలోని యూనియన్, టీఎన్జీవోస్ నాయకులకు సైతం విన్నవించారు. అయినా ఇప్పటివరకు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈఎన్‌సీ సీరియస్‌గా స్పందిస్తేనే తమకు న్యాయం జరిగే అవకాశం ఉందని ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తమకు పదోన్నతులు కల్పించకుంటే పోరాటాలు సైతం చేస్తామని ఉద్యోగులు చర్చించుకోవడం గమనార్హం.

**వివరాలు తెలుసుకుంటా..**

నేను ఇన్‌చార్జి డిప్యూటీ సీఈగా ఇటీవల బాధ్యతలు తీసుకున్నాను. పదోన్నతుల విషయం నాకు తెలియదు. నేను కూడా పూర్తి వివరాలు తెలుసుకుంటా. ఉద్యోగుల పదోన్నతులు ఆపడం ఉండదు.

– ప్రవీణ్, ఇన్‌చార్జి డిప్యూటీ సీఈ





## క్రైం కార్నర్

### రూ.కోటితో పశువుల వ్యాపారి పరారీ

వర్ని: మండలంలోని పలువురు పాడి రైతులను ఓ పశువుల వ్యాపారి గేదెలను తెచ్చిస్తానని నమ్మించి, రూ.కోటి వరకు వసూలు చేసుకొని పరారైనట్లు బాధిత రైతులు తెలిపారు. వివరాలు ఇలా.. వర్ని మండల కేంద్రానికి చెందిన బాపిరాజు అనే గేదెల వ్యాపారి వర్ని, జాకోర, కోటయ్య క్యాంపు, పొట్టిగుట్ట, అంతపూర్, పాత వర్ని గ్రామాలకు చెందిన రైతుల వద్ద, పాడి రైతుల వద్ద గేదెలు తెచ్చి ఇస్తానని నమ్మబలికి, డబ్బులు వసూలు చేశాడు. సుమారు రూ.కోటి వరకు జమకాగా గత రెండు రోజుల క్రితం కుటుంబంతో సహా గ్రామం వదిలి పరారీ అయినట్లు బాధితులు పేర్కొన్నారు. ఈమేరకు బాధితులు మంగళవారం వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో వివరాలు సేకరిస్తున్నట్లు వర్ని ఎస్సై రమేష్ తెలిపారు.

### గాలిపటాల దుకాణాలపై దాడులు

ఖలీల్‌వాడి: నగరంలోని పలు పతంగుల దుకాణాలపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు దాడులు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని 15 చైనా మాంజా బాబిన్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.15వేల వరకు ఉంటుందన్నారు. దుకాణాల యజమానులు అజాంరోడ్డుకు చెందిన ఎండీ ఆశ్రఫ్, మాలపల్లికి హైమద్ అలీలను చర్యల నిమిత్తం రెండో టౌన్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ అంజయ్య తెలిపారు.

### డయల్100 దుర్వినియోగం.. ఒకరి బైండోవర్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): డయల్100కు కాల్‌చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసి, దుర్వినియోగానికి పాల్పడిన ఓ వ్యక్తిని బైండోవర్ చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మండలంలోని సీతారాంతండాకు చెందిన రాథోడ్‌బాబు కొద్దిరోజుల నుంచి తరుచుగా డయల్100కు కాల్ చేసి మిస్ యూస్ చేస్తున్నాడన్నారు. దీంతో అతడిని పట్టుకొని మొదటి తప్పుగా భావించి, లక్ష రూపాయల పూచీకత్తుపై తహసీల్దార్ దశరథ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

### అర్ధరాత్రి వరకు షాపు తెరిచిన వ్యక్తికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మద్‌పురా కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు కిరాణాషాపు తెరిచిన యాజమాని ఖలీల్‌కు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై యాసీన్ ఆరాఫత్ మంగళవారం తెలిపారు. దుకాణాలను నిర్ణీత సమయం వరకే తెరిచి ఉంచాలని ఎస్సై తెలిపారు.

### దాడి ఘటనలో కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని అమ్మ వెంచర్ బ్రిడ్జి వద్ద డెలివరీ బాయ్‌పై దాడి జరిగిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. సోమవారం రాత్రి ఆన్‌లైన్‌లో బిర్యానీ ఆర్డర్ రావడంతో నగరంలోని అహ్మద్‌పుర కాలనీకి చెందిన అబ్దుల్ జునైద్ డెలివరీ చేయడానికి వెళ్లాడు. ఆర్డర్ ఇచ్చిన వారు అంతలోనే క్యాన్సిల్ చేశారు. ఈలోగా జునైద్ డెలివరీ కోసం వెళ్లగా మద్యంమత్తులో ఉన్న వినయ్, శశాంక్, శేక్ రేహాన్, అబ్దుల్ అర్బాజ్, విగ్నేష్ ఆర్డర్ క్యాన్సిల్ విషయంలో అతడితో గొడవపడి, డబ్బులు, ఆర్డర్‌ను లాక్కొని, కొట్టారు. అనంతరం జునైద్ తన ఇద్దరు స్నేహితులను తీసుకొని మళ్లీ వెళ్లగా ఇరువర్గాలు దాడి చేసుకున్నారు. ఈఘటనలో ముగ్గురికి గాయాలు కాగా, ఇరువురు ఒకరిపైఒకరు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఒకరి ఆత్మహత్య



లద్దాక్ గౌస్ (ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ముదెల్లి గ్రామానికి చెందిన లద్దాక్ గౌస్ అలియాస్ బాబు(32) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. గౌస్ బతుకుదెరువు కోసం రెండేళ్ల దుబాయికి వెళ్లి మూడునెలల క్రితం గ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి కుటుంబంలో గొడవలు జరగడంతోపాటు భార్య పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ముదెల్లి పెద్దచెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహం కోసం గాలించారు. లభ్యంకాకపోవడంతో మంగళవారం ఉదయం రెస్క్యూ చేసి మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

**మోర్తాడ్‌లో కూలీ..**

మోర్తాడ్: మండల కేంద్రంలో గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు చెందిన పాటిల్ దీపక్ (30) అనే కూలీ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. వివరాలు ఇలా.. దీపక్ మద్యానికి బానిసై భార్యతో తరచు గొడవపడేవాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

### బాలిక ఆత్మహత్యాయత్నం!

- యువకుడి వేధింపులే కారణం?

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16) ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పదో తరగతి చదువుతున్న సదరు బాలిక మూడు రోజుల క్రితం గడ్డిమందు తాగగా, గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది. అయినప్పటికీ ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం. ఐతే, బాలిక ఆత్మహత్య యత్నానికి ఓ యువకుడి వేధింపులే కారణమని తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

# స్నేహితుడినంటూ.. వైద్యం కోసం డబ్బు కావాలంటూ..

- యువకుడిని మోసగించిన సైబర్ మోసగాళ్లు
- రూ.1.63 లక్షలు స్వాహా

ధర్పల్లి: అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో మోసాలు చేస్తున్నారు. తన స్నేహితుడినంటూ ఓ యువకుడిని బురిడి కొట్టించి, రూ.1.16 లక్షలు కాజేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన ప్రశాంత్‌కు నాలుగు రోజుల క్రితం గుర్తుతెలియని నెంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తన స్నేహితుడు రవి లాగా మాట్లాడి, తనకు ఆరోగ్యం బాగాలేదని, చికిత్స కోసం డబ్బులు కావాలన్నాడు. నమ్మిన ప్రశాంత్ వారు చెప్పిన అకౌంట్ కు రూ.1.63 లక్షలు పంపించాడు. అనంతరం ప్రశాంత్ తన స్నేహితుడైన రవికి ఫోన్ చేసి డబ్బులు వచ్చాయని అడగగా నాకు ఎలాంటి డబ్బులు రాలేవని, నేను ఆరోగ్యంగానే ఉన్నానని స్పష్టం చేశాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన ప్రశాంత్ పోలీసులను ఆశ్రయించారు. మంగళవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

### ఆన్‌లైన్ గేమ్‌లో రూ.4.30 లక్షలు మాయం

వేల్పూర్: ఆన్‌లైన్‌లో గేమ్ ఆడుతూ ఒకరు రూ.4.30లక్షలు మోసపోయినట్లు ఎస్సై సంజీవ్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఒకరికి ఫేస్‌బుక్‌లో ఓ లింక్ రాగా ఒపెన్ చేశాడు. అందులో ఆన్‌లైన్ గేమ్ ఆడడం కోసం సహాయం చేస్తామని ఉండటంతో అవతలి వ్యక్తికి మొదట రూ. 1100 ఫోన్‌పే ద్వారా పంపారు. తర్వాత పలు దఫాలుగా అవతలి వ్యక్తికి మొత్తం రూ. 4.30 లక్షలు పంపించారు. అనంతరం అవతలి వ్యక్తి నుంచి స్పందన కరువైంది. దీంతో బాధిత వ్యక్తి డబ్బుల కోసం అవతలి వ్యక్తికి చాలా సార్లు ఫోన్ చేయగా, లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయానని గ్రహించారు. ఈమేరకు బాధిత వ్యక్తి సైబల్ సెల్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

### మొరం తరలిస్తున్న జేసీబీ సీజ్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న జేసీబీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మహేందర్‌కుమార్ మంగళవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట శివారులోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న సమాచారం మేరకు అక్కడికి వెళ్ళి జేసీబీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసిల్దార్ తెలిపారు.

### చికిత్స పొందుతూ ఒకరి మృతి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని ఓ వ్యక్తి ఇటీవల బైక్ అదుపుతప్పి గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని చావనితండాకు చెందిన మధుసింగ్ (31) కొన్ని రోజుల క్రితం తన బైక్‌పై వెళుతుండగా పంది అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈఘటనలో అతడి తలకు తీవ్రగాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారం రోజులు చికిత్స అందించగా, బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. దీంతో అతడిని సోమవారం కుటుంబసభ్యులు ఇంటికి తీసుకురాగా రాత్రి సమయంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### వాహనాల తనిఖీల్లో డబ్బు పట్టివేత

ధర్పల్లి: వాహనాలు తనిఖీ చేస్తుండగా బైకుపై తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.10.50 లక్షలు పట్టుకున్నట్లు ఎస్సై రామకృష్ణ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. మండల కేంద్రం నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు మార్గంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మండలంలోని వాడీ, సీతాయిపేట్ గ్రామాలకు చెందిన అరుణ్, సాయిలు అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తుండగా, వారిని పోలీసులు ఆపి, తనిఖీలు చేశారు. వారి బ్యాగులో నగదు ఉన్నట్లు గుర్తించి, వివరాలు అడిగారు. ఆ నగదును కోరుట్లకు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి తమకు ఇచ్చినట్లు వారు చెప్పినట్లు ఎస్సై తెలిపారు. పొంతనలేని సమాధానం చెప్పడంతోపాటు ఎటువంటి రసీదులు లేకపోవడంతో నగదును పంచనామా నిర్వహించి, తదుపరి చర్యల నిమిత్తం ఐటీశాఖకు అప్పగించినట్లు తెలిపారు.

# డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: జిల్లాలో ఇటీవల నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ పలువురికి స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లికి చెందిన ఇసపల్లి అబ్బయ్యకు ఒక రోజు జైలు శిక్ష, అలాగే శివతండాకు చెందిన కేతవాత్ సంతోష్, ముల్లంగికి చెందిన షేక్ జియోవుద్దీన్, మద్దెపల్లికి చెందిన ఇస్లావత్ శివరాంలకు రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు తెలిపారు. అలాగే పోతంగల్‌కు చెందిన తోకల సంజీవ్, బోధన్‌కు చెందిన బంటు శ్రీనివాస్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. వీరిని సారంగాపూర్ జైలుకు తరలించినట్లు వివరించారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన టేకు రమేష్ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడపగా పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. నిందితుడిని మంగళవారం ఆర్మూర్ కోర్టులో హాజరుపరుచగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

ఖలీల్‌వాడి: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 21 మందికి నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించి మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ మంగళవారం తెలిపారు. వారిలో 19 మందికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌కు రూ.28,500 జరిమానా విధించగా, ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

**సిరికొండ మండలంలో..**

సిరికొండ: మండలంలోని చిన్న వాల్గొట్ చౌరస్తా వద్ద మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో నలుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్ తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తున్నప్పుడు పరీక్షలు నిర్వహించగా నలుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తెలిసిందన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.